# 35. నిజం నిప్పుగాదు

కపూర్తలా సంస్థానాధీశులు మహారాజా ఖరక్ సింహాజీ వారికి వంశోద్ధారకుడు లేడు.

మహారాజా వారికి పుత్రోదయం కలగక ముందే "లాభంలేదు మహాప్రభో, తమరిహపిల్లల్ని పుట్టించేందుకు పనికిరారు!" అని తేల్చేశారు ఆస్థాన వైద్యులవారు.

అన్నీ అప్పటికే అనుభవించేసి ఉన్న మహారాజావారికి అందుకేం బాధలేదు, కానీ, కష్టపడి విస్తరించుకున్న మహా సంస్థానాన్ని చూస్తూ చూస్తూ తన బిడ్డ గాని వాడికెవడికో ఓ వారసుడికి కట్ట బెట్టటం మాత్రం సుతారం ఇష్టంలేదు.

మరేం చేద్దాం......?

అని మహారాజా వారు ఆలోచించేరు; మంత్రుల్ని కూడా పిలిపించి వారితోనూ రహస్యంగా ఆలోచించేరు. సన్నిహితులకు విందులుచేసి చల్లగా సలహాలడిగేరు.

ఒక్కొక్కరూ ఒక్కో సలహా ఇచ్చేరు గానీ మహారాజా వారికి ఆవేవీ ఆచరణ యోగ్యంగా కనిపించాయి గావు. చివరికి ప్రధాన మంత్రీ, మరో మంత్రీ కలిసి అపూర్వమైన ప్రణాళిక నొకదాన్ని తయారు చేసి అత్యంత రహస్యంగా ప్రభువుల వారికి నివేదించారు.

మహారాజావారు మొదట ఒప్పుకోలేదు కానీ దిగిరాక తప్పనూ లేదు. అంతకు మించి మరో సులు మార్గం గోచరించనూ లేదు.

ఓ శుభ ముహూర్తాన ఆస్థాన వైద్యులవారు మహారాణివారు గర్భవతిగా ఉన్నట్లు ప్రకటించేరు, కేసరిదేవి అనే అనుభజ్ఞురాలైన మంత్రసానిని సదా మహారాణీ వారిని కనిపెట్టుకుని ఉండేందుకై వినియోగించేరు.

మహారాణీ వారికి తొమ్మిది నెలలూ నిండేవరకూ దేశం అంతా ఆత్రుతతో ఎదురు చూసింది. రాజ్యానికి వారసుల మవుదామనుకుంటున్న రాజ బంధువులు గుబులు గుబులుగా ముందు వెనకలుచూసేరు.

ఓ సుదినాన మహారాణివారు వంశోద్ధారకుడినే కన్నారు.

అలా పుట్టిన యువరాజా వారి గౌరవార్థం రాజ లాంఛనాలతో వేడుకలు జరిగేయి. తుపాకులు పేలి స్వాగతం పలికాయి, నలబై రోజుల పాటు సంస్థాన మంతటా ఆనందోత్సవాలు వైభవంగా జరిగేయి. ఇందు నిమిత్తం ప్రత్యేకంగా పదిలక్షల రూపాయలు రాజ కోశాగారం నుండి బయటికి ప్రవహించేయి. బీదలకు అన్నదానం జరిగింది; ఖైదిలకు విముక్తి లభించింది.

రాచ మందిరంలో జరిగిన మహోత్సవాలకు సాక్షాత్తూ పంజాబ్ ప్రాంతపు బ్రిటిష్ వారి గవర్నర్ వేంచేసేరు. వారికి తోడుగా కాశ్మీర్ పాటియాలా, గ్వాలియర్ వంటి ప్రసిద్ధ సంస్థానాధీశులు విచ్చేశారు.

జరిగింది మాత్రం బహు కొద్దిమందికే తెలుసు. ప్రధాన మంత్రి గారి ఇంటి కెదురుగానే లాలాహరిచంద్ అనే ఉన్నత వంశీయుడుండే వాడు. ఆయనగారి భార్య గర్భవతి అని తెలిసిన ప్రధాన మంత్రి గారికి అద్భుతమైన అలోచన తట్టింది. అందుపై లాలాహరిచంద్‌కు పెద్దమొత్తం ఆశ పెట్టేరు. రాజాస్తానంలో ఉన్నత పదవిని కట్టబెట్టేరు.

ఫలితంగా మహారాణివారు ప్రసవించనట్టు ప్రకటించటానికి కొద్ది

ముందే లాలాహరిచంద్ భార్యకు పుట్టిన పసికందును అత్యంత రహస్యంగా మహారాణీవారి ప్రక్కలోకి చేరవేసేరు. సంగతి గ్రహించే అవకాశం ఉన్న బహుకొద్ది మంది డాక్టర్లు, నర్సులు, నౌకర్ల నోళ్ళు డబ్బుతో పూడ్చివేయ బడ్డాయి.

అంతా సజావుగా జరిగి పోయింది. కపూర్తాలా సంస్థానాన్నేలుకు నేందుకో యువరాజుద్భవించేడు.

కానీ, తామే వారసులమని కిలలు కంటున్న రాచ బంధువులకు మాత్రం ఈ శుభవార్త దుర్వార్త అయిపోయింది. రంధ్రాన్వేషణ ప్రారంభించిన వారికి క్రమంగా అసలు నాటకం అర్థంఅయింది గానీ, ఆధారాలు మాత్రం దొరకలేదు. మూసుకు పోయిన నోళ్లను తెరిచేందుకు కావలసిన బంగారు నాణేలు వారివద్ద తగినంతగా లేవు.

అయినా వారు ఆగలేదు. సంస్తానా లన్నింటి మీదా పెత్తనం చేస్తున్న బ్రిటిష్ ప్రభుత్వానికి వారు విన్నపం పంపుకున్నారు. "ప్రభో మాకు న్యాయం చేకూర్చండి, మహారాజావారి నాటకాన్ని నిషేధించండి" అని మొర పెట్టుకున్నారు.

అందుపై బ్రిటిష్ ప్రభుత్వం కల్నల్‌వార్‌బర్టన్ అనే ఆస్థాన వైద్యుడి నొకర్ని సంగతేమిటో తేల్చుకురమ్మని కపూర్తాలా పంపించింది.

సదరు డాక్టరు మహాశయుడు కపూర్తలా వేంచేసి మహారాణి వారినీ, డాక్టర్లనూ, నర్సులనూ, రాజోద్యోగులనూ, పౌరులనూ అనేక మందిని కలసి మాట్లాడి మాట్లాడి చివరకు, నిజమే! మహారాణివారు నాటకం ఆడేరు, అద్భుతంగా ఆడేరు: అనే నిర్ణయానికొచ్చేరు.

కాని......

ప్రధాన మంత్రిగారు సమయజ్ఞులూ ధన మూలం ఇదం జగత్తనే సూక్తిని ఒంట బట్టించుకున్న వారు. కనుక మరు క్షణం సదరు బ్రిటీష్ డాక్టర్‌గారి నోటిని వజ్ర వైడూర్యాల్తో మూసివేసేరు. బుర్రను ముత్యాల్తో నింపి వేసేరు.

అందుమీదట సదరు డాక్టరుగారు "అవును. ఈ బిడ్డడు మహారాణీ వారికి పుట్టినవాడే : అందుకు సందేహంలేదు" అని రిపోర్టు రాసి పంపే సేరు.

మరి వారసుల మవుదా మనుకుంటున్న వా రూరుకుంటారా ? సరా సరి వెళ్ళి బ్రిటీష్ వైస్రాయ్ చేతులు పట్టుకుని "అయ్యా ఇవి చేతులు గావు కాళ్ళు అనుకోండి, మాకు మహాపకారం జరిగిపోతోంది; రక్షించండి" అని మొర పెట్టుకున్నారు.

ఈ సంగతి తెలిసిన ప్రధాన మంత్రిగారు సంస్థానంలోని దాదాపు వేయిమంది ప్రముఖుల సంతకాల్తో వీరి "దుష్ప్రచారాన్ని" ఖండింప జేస్తూ వైస్రాయికో వినతి పత్రాన్ని పంపించేరు.

అయినా వైస్రాయి మహాశయుడు ఆగక ఈసారి తనకునమ్మకస్తుడైన మరో బ్రిటీష్ ఉన్నతోద్యోగిని సంగతేమిటో తేల్చుకు రమ్మని కపూర్తలాకు పంపించేడు.

ప్రధాన మంత్రిగారు ఆ ఉద్యోగికి ఆయన సతీమణికి ఘన స్వాగతం ఇచ్చేరు, సాయంత్రంలోగా ఓ వెలలేని వజ్రాలహారం ఆ ఉద్యోగి భార్యకంఠాన్న ప్రకాశించ నారంభించింది. ఆ వెలుగులకు కళ్ళు మిరు మిట్లు గొలిపిన ఉద్యోగి "అవును యువరాజా వార్ని సాక్షాత్తూ మహారాణి వారే కన్నారు. అందులో సందేహంలేదు" అని తనరిపోర్టును రాసేసేరు.

అందుమీదట సంస్థానాధీశులపై దుష్ప్రచారం చేసినందుగ్గాను వారసుల మనుకుంటున్న రాజ బంధువులకు శాస్త్రోక్తంగా దేశ బహిష్కారం లభించింది.

ఆ విధంగా రాజవంశంలో జన్మించిన యువరాజా జగత్‌జిత్ సింహజీవారు తన అయిదవ ఏటనే మహారాజా ఖరక్ సింహజీవారు కీర్తిశేషులవగా గద్దె నెక్కారు.

సూర్య వంశజులైన మహా ప్రభువుగా శ్రీవారు దరిమిలా సుప్రసిద్ధులయ్యేరు కూడా.

★